నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, బుధవారం 20 మార్చి 2024 | RANGAREDDY

సునీతారెడ్డిపై అవిశ్వాసానికి

హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- రాష్ట్ర ధర్మాసనానికెళ్లిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు
- వారంలోగా ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశం
- పనిలో నిమగ్నమైన జిల్లా అధికారులు
- వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ కాంగ్రెస్‌లో చేరడంతో అవిశ్వాస నోటీసిచ్చిన 12 మంది బీఆర్ఎస్ జడ్పీటీసీలు

వికారాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అవిశ్వాసంపై మళ్లీ కదలిక వచ్చింది. సునీతామహేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వారం రోజుల్లోగా ఆ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు తదనంతరం జడ్పీ పీఠాన్ని దక్కించుకునేలా పట్టు బిగిస్తున్నారు. ఇందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే నిర్ణీత సమయంలోగా బలపరీక్ష నిర్వహించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు.. నెల రోజులు దాటినా అవిశ్వాసం పెట్టకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు వారి పిటిషన్‌ను పరిశీలించిన రాష్ట్ర ధర్మాసనం... అందుకు సంబంధించి న ప్రక్రియను వారం రోజుల్లోగా చేపట్టాలని సర్కారును ఆదేశించింది. అవిశ్వాస తీర్మానం పెట్టరనే ధీమాతో ఉన్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీకి కోర్టు గట్టి షాకిచ్చింది. హైకోర్టు ఆదేశాలతో సునీతారెడ్డి వర్గం ఆందోళనలో పడింది. చేవెళ్ల ఎంపీ టికెట్‌ను ఆశించి ఆమె కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఆ టికెట్ సునీతారెడ్డికి కాకుండా రంజిత్‌రెడ్డికే ఆ పార్టీ ఫైనల్ చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. ఓ వైపు ఎంపీ టికెట్ పోయి, మరోవైపు ఆమెపై హైకోర్టు అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆదేశాలివ్వడంతో జడ్పీ చైర్‌పర్సన్ పదవి పోయే పరిస్థితి ఉండడంతో సునీతారెడ్డి సందిగ్ధంలో పడిపోయారు.

అవిశ్వాసానికి 12 మంది సభ్యుల మద్దతు అవసరం..

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని హైకోర్టు ఆదేశాలివ్వడంతో ఆ దిశగా అధికారులు ముందుకెళ్తున్నారు. అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చిన 12 మంది జడ్పీటీసీల సంతకాలు వారివేనా కాదా..? అనేది పరిశీలిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం పెడితే మూడింట రెండోవంతు సభ్యుల మద్దతు అవసరం. అయితే జిల్లాలో మొత్తం 18మంది జడ్పీటీసీలుండగా వారిలో 12 మంది జడ్పీటీసీల మద్దతు ఉంటేనే అవిశ్వాసం నెగ్గుతుంది. అయితే కాంగ్రెస్ నుంచి పెద్దేముల్, బంట్వారం జడ్పీటీసీలు మాత్రమే గెలుపొందగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన బషీరాబాద్ జడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఇటీవల జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కూడా హస్తం పార్టీ చేరడంతో ఆ పార్టీ సభ్యుల సంఖ్య నలుగురికి చేరింది. మిగతా 14 మంది జడ్పీటీసీలు బీఆర్ఎస్‌లోనే ఉండడంతో అవిశ్వాస తీర్మానం పెడితే నెగ్గేందుకు బీఆర్ఎస్ పార్టీ పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నది. అయితే వికారాబాద్, పరిగి, మర్పల్లి, ధారూరు, నవాబుపేట, దౌల్తాబాద్, దోమ, కులకచర్ల, మోమిన్‌పేట, పూడూరు, కొడంగల్, తాండూరు జడ్పీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

కోర్టు సూచన మేరకు ముందుకెళ్తాం...

జడ్పీ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై వారం రోజుల్లోగా ప్రక్రియను ప్రారంభించాలని హైకోర్టు ఆదేశించింది. కోర్టు సూచనల మేరకు ముందుకెళ్తాం. అంతేకాకుండా అవిశ్వాసం నోటీసిచ్చిన 12 మంది జడ్పీటీసీల సంతకాలను పరిశీలించాలని జడ్పీ సీఈవోను ఆదేశించాం.

– నారాయణ రెడ్డి, వికారాబాద్ కలెక్టర్

జిల్లాలో అకాల వర్షం

- పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం
- ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందిన జిల్లా ప్రజానీకం

రంగారెడ్డి, మార్చి 19(నమస్తే తెలంగాణ) : పగలంతా భానుడి ప్రతాపం కనబడగా.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మంగళవారం సాయంత్రం జిల్లాలోని పలు చోట్ల అకాల వర్షం కురిసింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన జల్లులు పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా మంగళ, బుధ, గురువారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం జిల్లాలో వర్షం కురిసింది. ఫిబ్రవరి చివరి వారం నుంచే ఎండలు విపరీతంగా ఉండడంతో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణం కన్నా అధికంగా నమోదవుతుండడంతో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం వల్ల ఉక్కపోతతో అల్లాడిన ప్రజానీకానికి కాస్తంత ఉపశమనం లభించింది.

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇటీవల శాసనసభ ఎన్నికల్లో వినియోగించిన పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అందుబాటులో ఉన్నాయా? లేక దూరంగా ఉన్నాయా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు.



లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం కసరత్తు

- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1500కు మించకుండా జాగ్రత్తలు
- అసెంబ్లీ ఎన్నికల్లో 3,369 పోలింగ్ కేంద్రాలు
- లోక్‌సభ ఎన్నికల నాటికి 3,455కు పెరుగనున్న కేంద్రాలు
- కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించిన రంగారెడ్డి కలెక్టర్

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

రంగారెడ్డి, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నిక సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో ఓటర్ల సంఖ్య 1500లు ఉండాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల తక్కువగా, మరికొన్ని చోట్ల ఎక్కువ ఓట్లు ఉన్నాయి. ఎక్కువ మంది ఉన్న కేంద్రాల ఓటర్లను సమీప కేంద్రాల్లో విలీనం చేయడమా ? లేదా కొత్తగా మరో కేంద్రాన్ని ప్రతిపాదించడమా ? అనే అంశాలను పరిశీలించి నివేదికను రూపొందించారు.

కొత్తగా 86 కేంద్రాల ఏర్పాటు..

లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పెరుగనున్నాయి. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నాటికి 3,369 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1500లకు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 73 ఉండగా.. 2కి.మీ.ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలు 13 ఉన్నాయి. దీంతో 2కి.మీ.ల దూరం లోపల కేంద్రాలు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నియోజకవర్గస్థాయిలో అధికారులు కొత్తగా 86 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు జాబితాను రూపొందించారు. వీటిని జిల్లా కలెక్టర్ పునః పరిశీలించి ఈసీకి నివేదించారు. అక్కడి నుంచి అనుమతులు రావాల్సి ఉన్నది. ఈసీ నుంచి అనుమతులు వస్తే.. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల సంఖ్య 3,455కు పెరుగనున్నాయి.

ఒకే చోట ఓటు వేసేలా..

ప్రతి ఎన్నికలోనూ పోలింగ్ కేంద్రాలను సర్దుబాటు చేసినా కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో గత ఇబ్బందులను అధిగమించడంపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టింది. ఒక కాలనీలోని ఓటర్లకు దూరాన ఉన్న మరో ప్రాంతంలో పోలింగ్ కేంద్రం ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో ఒక కాలనీలోని ఓటర్లందరూ ఒకే చోట ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండడంతో కొన్నిచోట్ల ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఓటింగ్ శాతం తగ్గుతున్నది. ఈసారి కుటుంబంలోని అందరూ ఒకే కేంద్రంలో ఓటు వేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వసతులపై ఆరా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అక్కడక్కడా పలు లోపాలు బహిర్గతమయ్యాయి. పోలింగ్ కేంద్రాల్లో వసతులు లేక ఓటర్లు ఇబ్బంది పడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈ సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్రాల పరిస్థితిని తెలుసుకున్నారు. ఎక్కడైనా భవనాలు శిథిలావస్థలో ఉన్నాయా ? ఏమైనా మరమ్మతులు అవసరమా !.. అన్న కోణాల్లో వివరాలు సేకరించారు. శిథిలావస్థలో ఉంటే ప్రత్యామ్నాయంగా సమీపంలోని మరో భవనంలోకి కేంద్రాలను మార్చనున్నారు. పోలింగ్ నాటికి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనుండడంతో పోలింగ్ కేంద్రాల్లో నీడ వసతి, తాగునీటి సదుపాయం కల్పన వంటి వాటిపై అధికారులు దృష్టి పెట్టారు.



జిల్లాలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఇలా..

నియోజకవర్గం	ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలు	1500 ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న కేంద్రాలు	2కి.మీ.ల దూరంలో ఉన్నవి	కొత్తగా ప్రతిపాదించినవి	లోక్‌సభకు ఏర్పాటయ్యే కేంద్రాలు
ఇబ్రహీంపట్నం	319	24	0	24	343
ఎల్బీనగర్	570	01	0	01	571
మహేశ్వరం	511	26	0	26	537
రాజేంద్రనగర్	535	08	0	08	543
శేరిలింగంపల్లి	622	11	0	11	633
చేవెళ్ల	298	0	0	0	298
కల్వకుర్తి	262	0	05	05	267
షాద్ నగర్	252	03	08	11	263
మొత్తం	3,369	73	13	86	3,455

వన్యప్రాణులకు రక్షణ కరువైంది. మహావీర్ హరిణ వనస్థలి జాతీయ వనంలోని మర్రిపల్లి అటవీ ప్రాంతంలో పదుల చోట్ల కంచె కనిపించడమే లేదు. ఎండలు మండుతున్న నేపథ్యంలో జింకలు, అలుగులు, ఇతర జంతువులు బయటకొచ్చి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. కుక్కలు సైతం అడవిలోకి వెళ్లి అటవీ జంతువులపై దాడి చేసే ప్రమాదం ఎక్కువగా ఉన్నది.

తట్టిఅన్నారం ఇందు అరణ్య ఎదురుగా ఉన్న కొత్త రోడ్డులో కనిపించని కంచె

కంచె కనిపిస్తలే !

- మహావీర్ హరిణ వనస్థలి జాతీయ వనంలో వన్యప్రాణులకేదీ రక్షణ !
- తట్టిఅన్నారం, మర్రిపల్లి అటవీ ప్రాంతాల్లో అరకొరగా కంచె
- అటవీ జంతువులు బయటకొచ్చే అవకాశం
- కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసే ప్రమాదం

పెద్దఅంబర్‌పేట, మార్చి 19 : మహావీర్ హరిణ వనస్థలి జాతీయవనం విజయవాడ జాతీయ రహదారిని ఆనుకుని నగరంలోని ఆటోనగర్‌లో మొదలై పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం మీదుగా మర్రిపల్లిలో ముగుస్తుంది. వేల ఎకరాల్లో ఇది విస్తరించి ఉన్నది. మర్రిపల్లి పరిధిలోని అటవీ ప్రాంతంలో వందల సంఖ్యలో జింకలు, అడవి పందులు, నెమళ్లు, కుందేళ్లు, అలుగులు, వివిధ రకాల పక్షి జాతులు ఉన్నాయి. ఇంత విలువైన జంతు సంపద ఉన్న అటవీ ప్రాంతానికి రక్షణ కంచెలు కరువయ్యాయి. తట్టిఅన్నారం ఇందు అరణ్య ఎదురుగా ఉన్న కొత్త రోడ్డును ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో చాలాచోట్ల రక్షణ కంచె లేదు. నేరుగా వాహనాలు వెళ్లేలా ఉండడంతో అధికారుల నిర్లక్ష్యం ఎంతగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. కొన్నిచోట్ల ఇనుప కంచె తెగిపోయి ఉండగా.. మరికొన్ని చోట్ల అసలు కంచెనే కనిపించడం లేదు.

మందుబాబులు వెళ్తున్నారా ?

తట్టిఅన్నారం ఇందు అరణ్య ఎదురుగా ఉన్న కొత్త రోడ్డులో ఇటీవల వాహనాల రద్దీ పెరిగింది. తట్టిఅన్నారం–మర్రిపల్లి మార్గంలోని హరిణ వనస్థలి పార్కు ప్రాంతం వెంట ఇటీవల భారీ వాహనాలు ఎక్కువయ్యాయి. అటవీ ప్రాంతానికి సరైన కంచె లేక జంతువులు బయటికి వచ్చి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ఇందు అరణ్య ఎదురుగా ఉన్న కొత్త రోడ్డులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రహదారుల పక్కనే నిలబడి మద్యం సేవించే మందుబాబులకు ఇది అడ్డగా మారింది. ఇదే అదునుగా కొందరు మందుబాబులు అటవీ ప్రాంతంలోకి వెళ్తున్నట్టు అక్కడ ప్రచారం జరుగుతున్నది. అటవీ ప్రాంతానికి సరైన కంచెలు లేకపోవడం మందుబాబులకు కలిసొస్తున్నదనే మాటలు వినిపిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో భారీ వృక్షాలు ఉండటం, వాతావరణం చల్లగా ఉండటం, పోలీసులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉంటుందని ఈ ప్రాంతంలో కొందరు మందు తాగేందుకు ఇష్టపడుతున్నారనే ప్రచారం నడుస్తున్నది. అటవీ ప్రాంతంలోకి ఇలా యథేచ్ఛగా మందుబాబులు చొరబడడం చూస్తుంటే విలువైన జంతు సంపదకు ప్రమాదం ఉన్నదని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కలతో భద్రం

ఇటీవల నగర శివారు ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. నగరంలో పట్టుకున్న కుక్కలను సైతం పలువురు రాత్రి సమయాల్లో శివారుల్లోని కాలనీల్లో వదిలి వెళ్తున్నారు. ఇది కాలనీల వాసులకు ఇక్కట్లు తెచ్చిపెడుతున్నది. ఇది ఒకవైపు అయితే.. మరోవైపు హరిణ వనస్థలి పార్కు అటవీ ప్రాంతానికి సరైన రక్షణ కంచె లేక జంతువులు బయటికొచ్చే అవకాశం ఉన్నది. ఆ సమయంలో కుక్కల కంట పడితే అవి దాడి చేస్తాయి. రక్షణ కంచె సరిగా లేకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి కుక్కలే గుంపులుగా అటవీ ప్రాంతంలోకి చొరబడే అవకాశాలూ లేకపోలేదు. ఒక్కసారి జింకలు, ఇతర జంతువులు కుక్కలకు కనిపిస్తే చుట్టుముట్టి దాడి చేస్తున్నాయి. గతంలోనూ పలుసార్లు అడవి పందులు రోడ్లపై ప్రమాదాలకు గురయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు అటవీప్రాంతానికి శాశ్వతంగా రక్షణ గోడలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని జంతు ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఆర్కేనగర్‌లో గతంలో అటవీ ప్రాంతం నుంచి బయటకొచ్చిన అలుగు (స్థానికులు గుర్తించి అటవీ అధికారులకు అప్పగించారు)

మళ్లీ కేసీఆర్ పాలన రావాలి..

- బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారు
- పార్టీని వీడుతున్న వారికి తగిన గుణ పాఠం తప్పదు
- వంద రోజుల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాఫ్
- ఓట్లకోసం వస్తే ఆరు గ్యారెంటీలేవని నిలదీయండి
- కాంగ్రెస్, బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించాలి
- స్వార్థపరుడు, మానవత్వం లేని వ్యక్తి రంజిత్‌రెడ్డి
- చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వందరోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, కేసీఆర్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మాల్లారెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసి, ఒక్కహామీనీ నెరవేర్చలేదన్నారు. రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2500, 4వేలు పింఛన్ ఎందుకు అమలు చేయలేదో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు.

సముద్రంలో మునిగితే.. సమస్యలు సమసి పోతాయా.?

బీజేపీ ఎలాంటి ఎజెండా లేకుండా రాముడి పేరుతో రాజకీయం చేసి ఓట్లు దండుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. మోదీ సముద్రంలో మునిగితే దేశంలోని అన్ని సమస్యలు సమసిపోతాయా అని ప్రశ్నించారు. దేవుడికి రాజకీయ రంగు పులుముతున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లధనం తేస్తామని, పేదల అకౌంట్లలో రూ.15లక్షలు వేస్తామని, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు.

రంజిత్ రెడ్డి అంటే ఎవరో ప్రజలకు తెలియదు

మనసున్న ఎవ్వరూ కష్ట కాలంలో పార్టీ మారరని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు.

చేవెళ్ల ప్రజలకు రంజిత్ రెడ్డి ఎవరో తెలియదని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎక్కడో ఉన్న వ్యక్తిని తీసుకొచ్చి చేవెళ్ల ఎంపీగా గెలిపించి ఉన్నత స్థానంలో కూర్చోబెడితే.. మానవత్వం లేని రంజిత్ రెడ్డి తన స్వార్థం కోసం పార్టీ మారారని విమర్శించారు.

కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుతున్నారు..

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిన కేసీఆర్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు మథన పడుతున్నారని, మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు సిద్ధంగా ఉన్నారని సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, ఏనుగు రాంరెడ్డి, సూర్ణగంటి అర్జున్, సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, భీమిడి స్వప్నా జంగారెడ్డి, పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పుట్టగల్ల సంతోష్‌కుమార్, ముత్యాల కృష్ణ, బోయపల్లి శేఖర్ రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, పెద్ద బావి ఆనంద్‌రెడ్డి, శివకుమార్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి